# ఓడిపోయిన సంస్కారం

సుందరమ్మ కంతా కలలో వున్నట్లుంది. పెండ్లంటే మేళతాళాలూ, పెద్దల హడావుడీ, పిల్లల కోలాహలం, మొదలైనవన్నీ వుంటాయనే ఆమె మొదట భయపడింది. మూడేండ్లనాడు తన మొదటి పెండ్లి ఆ విధంగానే జరిగింది. ఈ రెండవ పెండ్లి యే ఆర్భాటమూ లేకుండా కొద్ది మంది ఆత్మీయుల సమక్షంలో నవనాగరిక పద్ధతిలో జరుగుతుందని వారం రోజులనాడు తెలిసినప్పుడు ఆమె కెంతో మనశ్శాంతి కలిగింది. పెండ్లి ఐన సంవత్సరానికే వైధవ్యభారం నెత్తిన వేసుకొని పుట్టినిల్లు జేరిన తాను తిరిగి పెండ్లికూతురు వేషం ధరించాలంటే ఆమె చాలా సిగ్గుపడింది. పునర్వివాహానికి ఆమె మొదట తీవ్రంగా వ్యతిరేకించినా తన యిద్దరి అన్న గార్లూ యెడతెగకుండా చేసిన హితోపదేశాలవల్లా, విధవ ఐన ఈ రెండేండ్లలోనూ తాను గడించిన జీవితానుభవంవల్లా, ఆమె యీ రెండవ పెండ్లికి ఒప్పుకుంది. ఐనా ఒక సంవత్సరం పాటు భర్తతో కాపురం చేసిన తాను సిగ్గు పెండ్లికూతురుగా పదిమందిలోనూ ఎట్లా ప్రవర్తించడమా అన్న భయసంకోచాలు ఆమె మనస్సును పీడిస్తూనే వుండినాయి. అందు వల్ల ఈ పెండ్లి యే ఆర్భాటమూ లేకుండా ప్రశాంతంగా జరిగిపోతుందని తెలిసినప్పుడు ఆమె సంతృప్తితో నిట్టూర్చింది. తీరా యిప్పుడు చూస్తే ఆ పాత ఆచారాల ఆర్భాటమే మేలనిపించేటట్లుంది ఈ క్రొత్త వ్యవహార మంతా. పెండ్లేమో పది నిముషాల్లోనే అయిపోయింది. వచ్చిన బంధువులంతా, పురోహితునితో గూడా కలసి యిరవై మంది కంటే యెక్కువ లేరు. తనకు సిగ్గు పడాల్సిన ఘట్టాలేమీ లేకుండానే పెండ్లి ముగిసిందని ఆమె సంతోషిస్తూ వుండగానే — అంతలోనే ఉపన్యాసాల

కార్యక్రమం మొదలైంది. ఒక్కొక్కరే లేచి పెండ్లి కొడుకును అభినందించడం, అతని సంఘ సంస్కరణాభిలాషను పొగడడం, అతని ఔదార్యాన్ని మెచ్చుకోవడం, ఆఖరులో ఆశీర్వదించడం — ఆమె కంతా అయోమయంగా వుంది. సుమారు గంట నుండీ ఉపన్యాసాలు సాగుతున్నాయి. ఇప్పటికి ఐదారు మంది మాట్లాడినారు. ఇంకా యెంత మంది మాట్లాడుతారో? విధవను పెండ్లి చేసుకోవడానికి యెవరైనా సిగ్గు పడతారని మాత్రమే ఆమెకు తెలుసు. కాకపోతే ఈ కాలంలో అదేమీ తప్పుకాదనీ, అందువలననే విధవా వివాహాలు జరుగుతున్నాయనీ ఆమె అనుకుంది. కాని ఇందులో ప్రశంసించవలసిందేముందో ఆమెకు అర్థం కాలేదు. ఇంతలో ఒక యువకుడు లేచి, అందరూ పెండ్లి కొడుకైన రామనాథాన్ని మాత్రమే మెచ్చుకోవడం అన్యాయమనీ, సుందరమ్మ ధైర్య సాహసాలే యెక్కువగా మెచ్చుకోతగినవనీ ఉపన్యాసం మొదలు పెట్టినాడు. ఇదేదో మరీ విపరీతంగా కనపడిందామెకు. ఇందులో ధైర్యసాహసా లేమున్నాయి? జీవితమంతా సుఖపడాలనే ఆశతోనే తానీ పెండ్లికి సిద్ధ పడింది. అందులో తన్ను అంత పెద్దగా పొగడవలసిందేముంది? యితరుల కోసం తాను చేసిందేమీ లేదే? ఆ ఉపన్యాసం అయిపోయినంత వరకూ ఆమెకు ముండ్లమీద కూర్చున్నట్లే వుంది. అదృష్టవశాత్తు అది ఐన వెంటనే కాఫీ ఫలహారాల కార్యక్రమం ప్రారంభమైంది. తరువాత 20 నిముషాల్లోనే ఆమె భర్త గృహం చేరుకుంది.

రాత్రి భోంచేసిన వెంటనే పడక గదిలో మంచంమీద కూర్చుంది సుందరమ్మ. భర్త యెటువంటివాడా అని ఆలోచించడానికి పూనుకుంది ఆమె. కాని వెంటనే మూడేండ్లనాడు తనకు కార్యం అయిన నాటి పరిస్థితులకూ ఈనాటి పరిస్థితులకూ వున్నతేడా ఆమె మనసులో మెదలింది. ఆనాడు తన పెద్ద వదినె తన్నెంతో ఆప్యాయంగా అలంకరించి, గదివరకూ

తన్ను పిలుచుకొని వచ్చి వాకిలి దగ్గర వదలిపెట్టి పోయింది. ఆనాడు భర్త తన కొరకు ఎదురుచూస్తూ వుండినాడు. సిగ్గుతో, వుత్సాహంతో, ఉత్కంఠతో తా నానాడు పడక గదిలో ప్రవేశించింది. ఆనాడు వదినెల పరిహాసంతో తన సిగ్గు నూరంతలు పెరిగినా, యేదో అపూర్వమైన సౌఖ్యం, అనంతమైన అనందం తన కందబోతున్నదని అర్థంకాని ఉత్సాహం కూడా తన్నావేశించింది. ఈనాడు తన్ను అలంకరించేవాళ్లూ లేరు, పరిహసించేవాళ్లూ లేరు. ఆ సిగ్గూ లేదు, ఆ ఉత్సాహమూ లేదు. ఈనాడు తానే వచ్చి పడక గదిలో భర్తకొర కెదురుచూస్తూ కూర్చుంది. ఈనాడు తనకు కలగబోయే సుఖంయొక్క స్వరూపం తెలుసు. అందు వలన ఆనాటి ఉత్కంఠ లేదు. ఆనాడు తన ఉద్దేశాలతో నిమిత్తంలేకుండా యితరులు తన్నొక సుఖ సముద్రంలో త్రోసినారు. ఈనాడు తాను బుద్ధిపూర్వకంగా స్వప్రయత్నంతో ఆ సుఖ సముద్రాన్ని సమీపించింది. ఈ సుఖం తాను విధి నెదిరించి సంపాదించుకొన్న సుఖం. ఇది తన జన్మహక్కు. తన జన్మహక్కు కొరకు యెదురు చూడడంలో సిగ్గు పడవలసిందేమీ లేదు. తన హక్కు లభ్యమైనప్పుడు తానెవ్వరికీ కృతజ్ఞురాలు కానక్కరలేదు.

ఈ రామనాథం యెటువంటివాడో అన్న ప్రశ్న ఆమెకు మళ్లీ జ్ఞాపకం వచ్చింది. ఔను — భర్త గుణగణాలమీదే తన జీవితమంతా ఆధారపడి వుంటుంది. అతని స్వభావం మీదనే తన సుఖశాంతులన్నీ ఆధారపడుతాయి. అతను మంచివాడైతే తన బ్రతుకంతా ఒక పూలపాన్పు. అతను మంచివాడు కాకపోతే——ఐనా, అతను మంచివాని మాదిరే వున్నాడు. తప్పక మంచివాడే ఐవుంటాడు. లేకపోతే తన అన్నలు తననెందుకు అతనికిచ్చి పెండ్లి చేస్తారు! ఏమో? మొదట మంచివాళ్ళుగానే వుండి తరువాత యెంతమంది పెండ్లాలను వేధించుకు తినడం లేదు? ఇతని

సంస్కారం ఎటువంటిదో ? తన బ్రతుకంతా యితని స్వభావ సంస్కారాల మీదనే యేర్పడుతుంది.

సుందరమ్మకు యింకో విషయం జ్ఞాపకం వచ్చింది. మూడేండ్ల నాడు యిదే పరిస్థితిలో భర్త యెటువంటివాడు అన్న ప్రశ్న తనకు తట్టనే లేదు. ఆనాడు తనకు కలగబోయే సుఖాన్ని గురించే తాను ఊహించుకుంది. తన భవిష్యజ్జీవితాన్ని గురించే గాలి మేడలు కట్టుకుంది. ఆనాడు తన భర్త అందచందాలను గురించైనా కొంతవరకు తనలో తాను వితర్కించు కుందేగాని, అతని స్వభావ సంస్కారాలను గురించిన ఆలోచనే తనకు రాలేదు. ఈ విషయం జ్ఞాపకం వచ్చి ఆమె ఆశ్చర్యపడింది. వెంటనే కారణం స్ఫురించి తనలో తాను నవ్వుకుంది. పురుషుల స్వభావ సంస్కారాలే స్త్రీల సుఖ సంతోషాలను నిర్దాక్షిణ్యంగా నిర్ణయిస్తాయని ఆ నాడు తనకు తెలియదు, ఆనాడు తెలియనివి యీనాడు తనకెన్నో తెలుసు. ముఖ్యంగా స్త్రీలు సుఖపడడానికి పురుషుల ఆకారాలకంటె పురుషుల మనస్సులే ప్రధానం అన్న విషయం తనకు బాగా తెలుసు. అందుకే యీ పెండ్లి ఖాయమైనప్పటి నుండి ఈ ప్రశ్న యెడతెగకుండా తన కెదురౌతూనే వుంది. ఈ రామనాథం యెటువంటివాడు ? ఇతని మనస్సు యెటువంటిది ?

వాకిలి దగ్గర చప్పుడౌతూనే ఆమె తలయెత్తి చూసింది. భర్త కన బడగానే లేచి నిలబడింది. "సుందరీ, పెండ్లిలో నీకేమీ కష్టం కలుగలేదు గదా ?" అంటూ రామనాథం ఆమెను సమీపించి, మంచంమీద కూర్చొని, ఆమెను గూడా కూర్చోమన్నట్లు ఆమె భుజంమీద చేయివేసి బరువుగా నొక్కినాడు. సుందరమ్మ అతని ప్రక్కనే కూర్చుంటూ "లేదండీ" అన్నది.

రామనాథం ఉత్సాహంగా అందుకున్నాడు : "ఏర్పాట్లన్నీ స్వయంగా

నేనే చేయించినాను తెలుసా? నీ మనస్సు కేమీ ఆయాసం కలగకూడదని నేనెంత శ్రద్ధ తీసుకున్నా ననుకున్నావ్?"

"ఊఁ" అన్నది సుందరమ్మ నిరుత్సాహంగా.

రామనాథం మరింత ఉత్సాహంగా అన్నాడు: "ఊఁ అనడం గాదు సుందరీ! నీ సుఖం కొరకు నా జీవితమంతా ధారపోయటానికి సిద్ధంగా వున్నానంటే నమ్ము. ఈ పెండ్లిని గురించి యెంతమంది బంధువులకు దూరమైనా ననుకున్నావ్? అంతెందుకూ — రేపు పత్రికలో చూస్తావుగా నేను నీకొరకెంత త్యాగం చేసిందీ."

ఇంతవరకూ నేలకేసి చూస్తూ వున్న సుందరమ్మ తల యెత్తి రామనాథం ముఖంలోకి చూసింది. ఆ ముఖంలో వంచన యెక్కడా కనబడలేదు. అతని కన్నుల నిండా ఆత్మ సంతృప్తి తప్ప మరేభావమూ లేదు. ఆమె మెల్లగా అడిగింది: "నా కొరకు అంత త్యాగం చేయవలసిన పనేముంది మీకు?" అది ప్రశ్నగా కాక తన అభిప్రాయం చెప్పినట్లు శాంతంగా చెప్పబోయింది ఆమె. కానీ, మధ్యలో అప్రయత్నంగా కంఠం వణికి అది ప్రశ్నగా ధ్వనించింది. తనకు తెలియకుండానే తనలో కలిగిన ఆవేశానికి సిగ్గుపడి ఆమె మళ్ళీ తల వంచుకుంది.

రామనాథం యివన్నీ గమనించకుండానే వెంటనే జవాబు చెప్పినాడు. "అదేం మాట సుందరం? మానవులన్న తర్వాత ఆదర్శాల కొరకు త్యాగం చెయ్యకపోతే యెట్లా? నీబోటి యువతులందరూ నిష్కారణంగా జీవిత సౌఖ్యాలకు దూరమై ఉసూరుమంటుంటే మన సంఘం బాగుపడేదెట్లా?"

సుందరమ్మ మౌనంగానే వుంది. అతని మనస్సును అర్థం చేసుకోడానికి ఆమె ప్రయత్నిస్తూ వుంది. ఈ మనిషికి నన్ను సుఖ

పెట్టాలని యింత తాపత్రయ మెందుకో? తాను సుఖపడాలనే ఆశ యితని కే కోశానా లేదా? ఆమె ఆలోచనలు రామనాథం సాగనివ్వలేదు. రెండు చేతులతోనూ ఆమె ముఖం తన వైపుకు తిప్పుకొని అతనన్నాడు: "యిటు చూడు సుందరం, యీ పెండ్లి కాకుండా వుంటే నీ జీవితమంతా యెట్లుంటుందో ఊహించుకున్నావా? నేను త్యాగం చెయ్యకపోతే నీ బ్రతుకులోని చీకటంతా తొలగి పొయ్యేదెట్లా?"

అతని కన్నుల్లోకి చూస్తూ వున్న సుందరమ్మ కనురెప్పలు వాల్చి విచారంగా చిరునవ్వు నవ్వింది.

రామనాథం ఆమె చిరునవ్వును మాత్రమే చూసినాడు. ఆచిరునవ్వు లోని విచారాన్ని గమనించే స్థితిలో లేడు అతను. "చూడు — యిప్పుడు నీ బ్రతుకంతా వెన్నెల అయింది. నా త్యాగమంతా నీ చిరునవ్వు రూపంలో ఫలించినందుకు నాకెంత ఆనందంగా వుందనుకున్నావ్?" అని అన్నాడు సంతృప్తి, సంతోషం నిండిన కంఠంతో.

సుందరమ్మకు ఒక్కసారిగా భవిష్యత్తంతా అంధకారమయమైంది. 'ఇంత త్యాగం జీవితమంతా మోసే శక్తి నాకు లేదు' అని బిగ్గరగా అరవాలనుకుంది. ఆమె దిగ్గున లేచి నిలబడింది. అంతలోనే తన అసహాయత మెరుపువలె ఆమె మనసులో తోచింది. కండ్లు తుడుచుకుంటూ రామనాథం పాదాల దగ్గర నేలమీద కూర్చొని, "మీ త్యాగానికి తగిన యోగ్యత నాకు కలిగేటట్లు ఆశీర్వదించండి" అని గద్గద కంఠంతో పలికింది.

(జనవరి 1958)